జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

- ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందుల అందజేత
- మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందించే వైద్యశాలలకు సిఫార్సు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. సోమవారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ద్వారా సేవలందించే వైద్యశాలలకు డాక్టర్లు సిఫార్సు చేశారు. ఒంగోలులోని పాత మార్కెట్ సమీపంలో గల సెయింట్ థెరిస్సా హైస్కూలులో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. పాపాకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) పరిధిలోని కోటవీధి, గానుగపాలెం, గాంధీ రోడ్డు, గోపాల్‌నగర్, నీలాయపాలెం, ఇస్లాంపేట, పొనుగుపాటికాలనీ సచివాలయాల ప్రజలు పాల్గొనగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు కమిషనర్ తెలిపారు. పరీక్షలు నిర్వహించిన ప్రతిఒక్కరికీ ఒక కేసు షీట్ రూపొందించామన్నారు. సుమారు 385 మంది పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. క్యాంపులో ఇద్దరు జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు, ఒక ఆప్తమాలజీ, ఒక కార్డియాలజీ డాక్టర్ పాల్గొని పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, ఎంఈఓ జానీ, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సర్వేరెడ్డిపాలెంలో కిట్ అందజేస్తున్న ఎంపీడీవో అజిత


ఆలూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మాధవి, తదితరులు

సర్వేరెడ్డిపాలెంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని సర్వేరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు ఎంపీడీవో పి.అజిత ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో ప్రజలందరికీ వైద్యం అందించడం గొప్ప విషయమని అన్నారు. ఇది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమైందని అన్నారు. మొత్తం 722 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 9 మంది వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. రూ.5 లక్షల విలువ చేసే ఆయుష్మాన్‌భవ హెల్త్ కార్డులు అందజేశారు. ఎంపీడీవోతో పాటు పలువురు డాక్టర్లను సత్కరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్వేరెడ్డిపాలెం గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ భూపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కాకుమాని ఆదిశేషయ్య, కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జె.శ్రీనివాసరావు, ముప్పరాజు హరికృష్ణ, గృహసారథులు, కన్వీనర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదకొత్తపల్లిలో పాల్గొన్న జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి...

మద్దిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి టి.సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పెదకొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లో ఆశా వర్కర్లు రెండు వారాలకు మించి దగ్గు, కళ్లలో రక్తచారలు, రాగిరంగు మచ్చలతో బాధపడుతుంటే వైద్య శిబిరాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు. స్పర్శలేని రాగి రంగు మచ్చలున్నవారిని వైద్యులు పరీక్షించి త్వరితగతిన వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. ఆ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డీటీ జ్యోతి, స్త్రీ వైద్య నిపుణులు పి.తేజశ్విని, చిన్నపిల్లల వైద్య నిపుణులు డీ శ్రీనివాసరావు, గ్రామ పార్టీ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు, పోతినేని బుచ్చయ్యచౌదరి, పీహెచ్‌సీ డాక్టర్లు ఆనంద మోహన్, శ్రావణ్, జగదీష్, శిరీష, ఆస్పత్రి వైద్య శాఖ సిబ్బంది, విలేజ్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు ఆశావర్కర్లు, వలంటీర్లు, పాల్గొన్నారు.

గ్రామాల్లోనే నాణ్యమైన వైద్యం...

నాగులుప్పలపాడు: గ్రామాల్లోని నాణ్యమైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తోడ్పడుతోందని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు స్టేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు అన్నారు. జగనన్న ఆరోగ సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తకోట గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్యం, మందుల గురించి ప్రజలకు వివరించారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పెద్ద పెద్ద వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి చేతుల మీదుగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్నం సుజాత సురేష్, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

584 మందికి వైద్య పరీక్షలు...

కొత్తపట్నం: మండలంలోని ఆలూరు, గాదెపాలెం గ్రామాలకు సంబంధించి ఆలూరు హైస్కూల్లో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్‌లు పూనూరి మాధవి, గాదె కోటిరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇళ్లు కళకళలాడుతుందని, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందుకోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల ఫ్యామిలీ డాక్టర్, ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ ఆలూరు, గాదెపాలెం రెండు గ్రామాలకు సంబంధించి 584 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా 31 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆరోగ్య శ్రీ కార్డులు, జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు శైలేష్, ఉప సర్పంచ్ చాగంటి సుధాకర్‌రెడ్డి, గాదె శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం కోటమ్మ, యూడీసీ శరత్‌బాబు, జాలిరెడ్డి, అనూరాధ, డాక్టర్లు పాల్గొన్నారు.


ఒంగోలు సెయింట్ థెరిస్సా హైస్కూల్లో కిట్లు అందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు


పెదకొత్తపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి సురేష్‌కుమార్, అధికారులు.


కొత్తకోటలో మందులందజేస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి


కొత్తకోటలో డాక్టర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు స్టేట్ స్పెషలాఫీసర్ అశోక్‌బాబు

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

చీమకుర్తి: మండలంలోని ఏలూరివారిపాలెం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చింతగుంట్ల తిమోతి, గౌరవాధ్యక్షునిగా బక్కా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, శ్రీను, ఏసేబు, బలరాం, కోటయ్యను ఎన్నుకున్నారు. ఎంఈఎఫ్ అధ్యక్షుడు బొంతా ఏసుదాస్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పాటిబండ్ల జక్రయ్య పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు మీటింగ్‌లో పాల్గొన్న శిద్దా సుధీర్


సమావేశంలో పాల్గొన్న శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్ సోమవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో సమావేశం జరిగింది.

పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

ఒంగోలు సెంట్రల్: పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి కోరారు. జిల్లాలో పార్టీలో పలు మోర్చాల బాధ్యులు, పదాధికారులను నియమించారు. నూతన కమిటీ సభ్యులు శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

చీమకుర్తి: పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరమని జనశిక్షణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేర్నమిట్టలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ పదార్థాలు, వస్తువుల వినియోగం వలన పర్యావరణ పరిరక్షణకు కలుగుతున్న హానికరమైన సంఘటనలను వివరించారు. ప్లాస్టిక్ పదార్థాల స్థానంలో క్లాత్, జనపనార క్లాత్‌లతో చేసిన సంచులు వాడాలని జనశిక్షణ సంస్థ నిర్వాహకులు కే శ్యామ్‌సునీల్, కే రజిని తెలిపారు.

నిరుపేదలందరికీ పట్టాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

ఒంగోలు రూరల్: ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలాలు, పట్టాలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఒంగోలు తహసీల్దార్ పి.మురళి తెలిపారు. ఒంగోలు మండలంలోని చెరువుకొమ్ముపాలెం వాసులు సుమారు 60 మంది సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌ను కలిసి తమకు ఇళ్లు లేవని, తెలిపారు. ఒకే ఇంట్లో నాలుగు కుటుంబాలు ఉంటున్నామని తెలిపారు. ఇంటి స్థలాలు, పట్టాలు ఇప్పించాలని కోరారు. తహసీల్దార్ మురళి మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి అర్హులను గుర్తించి అనుమతి మేరకు పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు.

మత్స్యకారుల్లో ఆనందం


వలలకు చిక్కిన చేపలను చూస్తున్న మత్స్యకారులు

సింగరాయకొండ: మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్ర తీరంలో మత్స్య సంపద సమృద్ధిగా లభిస్తుండటంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా వాతావరణం అనుకూలించక, మరోపక్క కడలూరు సోనాబోట్ల కారణంగా మత్స్య సంపద లభించలేదు. ఒక దశలో పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో మత్స్యకారులు వేట విరమించుకున్నారు. ప్రస్తుతం సముద్రంలో చేపలు బాగా పడుతున్నాయని మత్స్యకారులు తెలిపారు. సోమవారం చేపల వేటకు వెళ్లిన జాలర్లకు కానాగంత, గుడ్ల గొరక చేపలు లభించాయి. కానాగంత కేజీ 100 రూపాయలు ఉండగా, గుడ్ల గొరక కేజీ 400 రూపాయలు ఉంటుందని మత్స్యకారులు వివరించారు.

నేడు వీడియో క్లాస్‌రూమ్ ప్రారంభం

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వీడియో క్లాస్ రూమ్ ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ జిలానీబాషా తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, సబ్‌కలెక్టర్ శోభికలు పాల్గొంటారన్నారు. అనంతరం లైబ్రరీలో కెరీర్ గైడెన్స్ సెల్ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయం

గాదెపాలెం (కొత్తపట్నం): ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం ఖాళీగా ఉన్న బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారని మండల వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆదేశాల మేరకు బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా గుత్తికొండ జాన్సీలక్ష్మి పొలంలో ప్రతి మూడడుగులకు ఆముదం, కంది, అలసంద, గోరుచిక్కుడు, అనుములు, సజ్జ పంటలు వేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన పర్యావరణాన్ని కాపాడటంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందన్నారు. ఇప్పుడు అందరికీ ఆమోదయోగ్యమైందన్నారు. గాదెపాలెంలో సాగునీరు తక్కువ లభ్యమయ్యే బంజరు భూముల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంట సాగుచేస్తున్నారని తెలిపారు. రైతు సాధికార సంస్థ చర్యలు, అవగాహన సదస్సులు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్‌లో నూరు శాతం ప్రకృతి వ్యవసాయం చేయించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన ధాన్యాన్ని తింటే సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కరిముల్లా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డప్ప, పిట్టు వెంకటేశ్వరరెడ్డి, సురేష్, శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.


బీడు భూముల్లో సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారులు

పొగాకు బోర్డు ద్వారా ఎరువుల సరఫరా ప్రారంభం

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు ద్వారా అందిస్తున్న ఎరువులను ఉపయోగించుకోవాలని గుంటూరు పొగాకు బోర్డు విస్తరణాధికారి దామోదరరావు సూచించారు. పొగాగు బోర్డు వేలం కేంద్రం-23 పరిధిలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీని ప్రారంభించారు. బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ పొగాకు సాగు చేసే రైతులు ఎరువుల కోసం నమోదు చేసుకున్న తర్వాత బ్యారన్ రెన్యువల్ చేయించుకుని ఎరువులు తీసుకెళ్లాలని కోరారు. ఫ్యాక్ట్ వారి అమ్మోనియం సల్ఫేట్, ఐపీఎల్ వారి డీఏపీ, ఎస్ఓపీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఒంగోలు-2 వేలం నిర్వహణాధికారి రామకృష్ణ, బోర్డు మెంబర్ పి.వరప్రసాద్, రైతు నాయకుడు వి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఎరువులు అందిస్తున్న బోర్డు విస్తరణాధికారి దామోదరరావు, అధికారులు

ఎమ్మెల్యే బాలినేని ఆదేశాలతో

ఓ ఇంటికి విద్యుత్ వెలుగులు


విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం


తీగలు బిగిస్తున్న విద్యుత్‌శాఖ కార్మికులు

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పెదదేవరపాడు గ్రామంలోని ఓ ఇంటికి విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. రెండురోజుల క్రితం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు విద్యుత్ సమస్యను బాలినేని దృష్టికి తీసుకొచ్చారు. ఒక కుటుంబం వారు ఊరికి దూరంగా వారికి ఉన్న కొద్దిపాటి స్థలంలో ఇళ్లు కట్టుకున్నారు. కానీ, అక్కడి వరకూ విద్యుత్ లైన్ లేకపోవడంతో ఆ ఇంటికి కరెంటు కనెక్షన్ ఇవ్వలేదు. ఆ ఇంటికి మీటర్ ఇవ్వాలంటే ఆ మార్గంలో నాలుగు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి. బాధితులు ఈ సమస్యను బాలినేనికి వివరించగానే విద్యుత్ అధికారులతో మాట్లాడారు. ఆ మేరకు సోమవారం విద్యుత్ అధికారులు నాలుగు స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు బిగించారు. ఆ ఇంటికి విద్యుత్ సరఫరా చేశారు. దీనిపై లబ్ధిదారులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై సీఎంకు వినతి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సింగరాయకొండ మండల సమస్యలను అర్జీ రూపంలో తెలియజేసినట్లు ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని భైరాగిమాన్యంలో ఉన్న 440 ఎకరాల ఎండోమెంట్ భూముల రిజిస్ట్రేషన్ సమస్య, రూర్బన్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.14 కోట్ల నిధులు, రూ.2 కోట్లతో ట్రంకురోడ్డు నిర్మాణం, శానంపూడి రోడ్డు, అలాగే క్రిస్టియన్ శ్మశానవాటికకు రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మాణం, పాకల గ్రామంలో రూ.78 లక్షలతో చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు.

కొత్తపట్నం బస్టాండ్ పరిసరాల్లో నేడు విద్యుత్ నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒంగోలు డి-4 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపట్నం బస్టాండ్‌తో పాటు కరవది డొంక, గోపాల్‌నగర్ నాలుగో లైన్ ఎక్స్‌టెన్షన్, కాకతీయ నగర్, ఇందుర్తి నగర్, రంగుతోట, పెద్ద మసీదు సెంటర్, చివుకులవారి వీధి, కేపీ బస్టాండ్ సెంటర్, ఆనందరావు రోడ్డు, బందరు రోడ్డు, మరాఠీపాలెం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

స్పందనకు 18 అర్జీలు

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నగర ప్రజల నుంచి 18 అర్జీలు అందినట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 5, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 4, శానిటేషన్ విభాగానికి సంబంధించి 4, రెవెన్యూ విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ వివరించారు. వాటిని ఆయా విభాగాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలి

ఒంగోలు సెంట్రల్: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కోరారు. సోమవారం ఒంగోలు వచ్చిన ఆయనను కలిసి ఆ మేరకు విజ్ఞప్తి చేశారు. ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆలయాలకు తాగునీటి సదుపాయం

చీమకుర్తి: చీమకుర్తి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని గాడిపర్తివారిపాలెంలోని సాయిబాబా మందిరం, పోలేరమ్మ ఆలయాలకు సురక్షితమైన తాగునీటి సదుపాయం కల్పించేందుకు వాటర్ డిస్పెన్సరీలను అందించారు. సోమవారం పోలేరమ్మకు పొంగళ్ల సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండా చినవెంకటేశ్వర్లు, అంబటి వీరారెడ్డి, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు గొల్లపూడి వెంకట్రావు, చౌదరి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, ముప్పూరి చలమయ్య, మేదరమెట్ల శ్రీనివాసులు చేతుల మీదుగా అందించారు. ఆలయాల నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వాటర్ కూలర్ అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి

ఒంగోలు సెంట్రల్: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ భవనానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్ కోరారు. సంబంధిత స్థలాన్ని సోమవారం మాదిగ సంక్షేమ పోరాట సమితి బాధ్యులు పరిశీలించి మాట్లాడారు. దళిత సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


స్థలం వద్ద నాయకులు

మూడు ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఇరిగేషన్ అధికారులు ఆదివారం రాత్రి మండలంలోని మోచర్లలో స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..పెద్ద చెరువులో నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఇరిగేషన్ జేఈ వెంకటరమణ సిబ్బందితో దాడి చేసి మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటికి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా చెరువుల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

టంగుటూరు: మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధిలోని వెంకటాయపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై సోమవారం ఎస్సై ఖాదర్ బాషా తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.18,030 నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

